క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థికి మంత్రి సన్మానం..



సన్మానం అందుకున్న విద్యార్థులు

బోనకల్/ముదిగొండ: బోనకల్ మండలం కిష్టాపురంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బోనకల్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. కాలేజీ ప్రథమ సంవత్సరం విద్యార్థి వడ్డెంపూడి శ్రీచరణ్ 470 మార్కులకు 468 సాధించగా.. సాయి 467, త్రివిక్రమ్, వేణు 466 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వీరిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించి రూ.10 వేల చొప్పున చెక్కులు అందించి భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

సివిల్స్ ర్యాంకర్ చరణ్‌తేజకు..



చరణ్‌తేజను సన్మానిస్తున్న గ్రామస్తులు

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన నర్శింశెట్టి చరణ్‌తేజ ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో 231వ ర్యాంక్ సాధించగా, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నర్శింశెట్టి హరినాథ్‌బాబు – నాగమణి దంపతుల కుమారుడైన చరణ్‌తేజ సివిల్స్‌లో ర్యాంక్ సాధించి గ్రామానికే కాక జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, నాయకులు మడుపల్లి భాస్కర్, బందెల నాగార్జున్, తూము కోటేశ్వరరావు, తోటకూరి గోవిందరావు, నర్శింశెట్టి శ్రీనివాసరావు, కంచం కోటేశ్వరరావు, బొలకొండ రామారావు, అంజయ్య, రామకోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, బొల్లికొండ వెంకటనారాయణ, వలమల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి చేయూత

బోనకల్: మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 470కి 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి రెండోస్థానం నిలిచింది. 2024లో ఏడు నెలల వ్యవధిలో ఆమె తల్లిదండ్రులు మృతి చెందినా కష్టపడి చదివిన నిరుపేద గౌతమిని సీపీఐ నాయకుడు తోట రామాంజనేయులు, ఆయన సోదరుడు ఆగ్రోస్ ఏజెన్సీ నిర్వాహకుడు తోట నాగకృష్ణ శనివారం సన్మానించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గౌతమి తల్లిదండ్రుల స్నేహితులైన బానోతు కొండ తొలుత ఆర్థిక సాయం అందించడమే కాక విషయాన్ని అందరికీ తెలియచేయడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో బానోతు కొండ, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు స్టాండ్ గొడుగులు వితరణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని రోడ్డుపక్కన పేద దినసరి వ్యాపారులకు ఐదు స్టాండ్ గొడుగులను శనివారం నిర్వాహకురాలు కొనకళ్ల సుధారాణి అందించారు. ఈ సందర్భంగా ఆమెకు దినసరి వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారికి ఇత్తడి తోరణం బహూకరణ

సత్తుపల్లి: సత్తుపల్లి కాకర్లపల్లి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రముఖ వైద్యులు ఇమ్మడి రంగారావు కుమారుడు ఇమ్మడి ప్రసాద్ దంపతులు రూ.55వేల విలువైన ఇత్తడి తోరణాన్ని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు చల్లగుళ్ల శ్రీనివాసరావు, దోసపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులను సన్మానించారు. ఇతర ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ముస్లింల హక్కుల పరిరక్షణకే బిల్లు

వైరా: వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలను ఇబ్బంది పెట్టేది కాదని, నిజమైన నిరుపేదలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక కామిశెట్టి కల్యాణ మండపంలో వక్ఫ్ సదరణ బిల్లుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాకదాని పుల్లారావు యాదవ్, ఈవీ రమేష్, జిల్లా కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, సీనియర్ నాయకుడు మందడపు సుబ్బారావు, బండారు నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు, కల్తి రాంప్రసాద్, వీరవల్లి రాజేష్ గుప్తా, మనుబోలు వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

కొణిజర్ల: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కొణిజర్లలో శనివారం అవగాహన సదస్సులో ఆయన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి స్వభావం, కొలతలను జీపీఎస్ సాంకేతికతో కూడిన యంత్రాలతో నిర్ధారించడమే కాక సాదా బైనామా తదితర దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే, వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్, హక్కుల బదలాయింపులో వివాదాలు జరగవని చెప్పారు. ఎవరైనా నష్టపోయినట్లు భావిస్తే అప్పీల్‌కు అవకాశముంటుందని కలెక్టర్ తెలిపారు.

బంగాళాఖాతంలో కలిపాం..

కొణిజర్ల/కారేపల్లి: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపామని వైరాఎమ్మెల్యే రాందాస్ నాయక్ చెప్పారు. కొణిజర్లతో పాటు కారేపల్లిలో జరిగిన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ భూ యజమానుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. అదే విధంగా మత్కేపల్లికి చెందిన రైతులు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఆయన స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సదస్సుల్లో ఆర్‌డీఓ జి.నరసింహారావు, తహసీల్దార్లు రాము, సంపత్ కుమార్, ఎంపీడీఓ సురేందర్, వైరా ఏడీఏ టి.కరుణశ్రీ, సొసైటీ చైర్మన్ రవి, ఏఓ బాలాజీ, ఆర్ఐలు రమేష్, అశోక్, నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు నారాయణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కొణిజర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్లు ఇచ్చి తీరుతామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కొణిజర్లలోని రేకుల ఇళ్లను పరిశీలించారు. దేరంగుల లక్ష్మి, సీతారాములు దంపతులు తన ఇద్దరు కొడుకులతో కలిసి ఉంటున్న రేకుల ఇంటిని పరిశీలించారు. పాతబజార్‌లో తడికల ఇళ్లు, ఎస్సీ కాలనీలో పూరి గుడెసెలను మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు ఎమ్మెల్యేకు చూపించి పరిస్థితి వివరించారు. తప్పకుండా వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంపల్లి రామారావు, నాయకులు శ్రీనివాసరావు, రమేష్, మోష తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే..



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా: వైరా పట్టణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వసుజాత ప్రధాన అనుచరుడు గ్రంధి ప్రవీణ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైరా బస్టాండ్ సెంటర్‌లో ఉచితంగా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ మానస

చింతకాని: రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మానస పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ, డిజిటల్ గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో శనివారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలతో పంటల సాగులో అవలంభించాల్సిన సమగ్ర యాజమాన్య పద్దతుల గురించి తెలుస్తుందన్నారు. అంతేకాకుండా పంటలకు ఏ మేరకు ఎరువులను వాడాలనే విషయం తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు విశ్లేషణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాము, అయేషా ఫాతిమా, తేజ, కల్యాణి, తాహియా నౌషీన్, డిజిటల్ గ్రీన్ ఎనర్జీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఇవ్వాలా, వద్దా?

దోలాయమానంలో ప్రైవేట్ విద్యాసంస్థలు

కొణిజర్ల: బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరగనుండగా, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల పరిస్థితి అడకత్తెరలో పోకలా మారింది. బీఆర్‌ఎస్ నేతలు పలువురు సభకు బస్సులు సమకూర్చాలని, అందుకయ్యే ఖర్చు భరిస్తామని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలను సంప్రదించారు. కొణిజర్ల మండలంలో ఓ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలతో పాటు నాలుగు ప్రైవేట్ స్కూళ్ల ఉండగా వాటి బస్సులు కేటాయించాలని ఓ మాజీ ఎమ్మెల్యే యాజమాన్యాలతో మంతనాలు జరపగా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. కానీ శనివారం ఉదయంకల్లా పరిస్థితి మారిపోయింది. ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు బయటకు తీస్తే కేసు నమోదు చేయాలని రవాణా శాఖ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. తనిఖీల కోసం కొణిజర్ల శివారు బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల వద్ద చెక్‌పోస్టు సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిసింది. దీంతోస్కూళ్ల యజమాన్యాలు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏన్కూరు: స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. గత పదిరోజులు సీపీఎం బృందం మండలంలో పర్యటించి పలు సమస్యలు తెలుసున్నారని తెలిపారు. మండలంలో కోతుల బెడద ఉండడంతో పాటు.. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. 30 కుటుంబాల నిరుపేదలు లెనిన్‌నగర్ పేరుతో కాలనీ ఏర్పాటు చేసుకొని పాకల్లో నివశిస్తున్నారని వారికి ఎటువంటి సౌకర్యాలు లేక చీకట్లో మగ్గుతున్నారన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, బాలాజీ, రాములు, లెనిన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

30న వక్ఫ్ సవరణ చట్టంపై బహిరంగ సభ

మధిర: మధిర మధిర వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఈనెల 30న ఈద్ మిలాప్ – వక్ఫ్ పరిరక్షణ ఐక్య బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ముస్లిం ఐక్య సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ తెలిపారు. మధిర మసీదులో శనివారం ఆయన మాట్లాడుతూ ముస్లింల ఐక్యతను బలోపేతం చేయడం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రజా చైతన్యాన్ని పెంపొందించడం, మతసామరస్యాన్ని మరింత పరిరక్షించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సభ ఉదయం 9గంటలకు మొదలవుతుందని పేర్కొన్నారు. ముస్లింలు, లౌకికవాదులు, సామాజిక కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో కమిటీ బాధ్యులు షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ మహమ్మద్ గౌసుద్దీన్, షేక్ గాలిబ్, సైదులు, జాకీర్ హుస్సేన్, హైదర్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



సత్తుపల్లి: మోటార్ సైకిల్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు

సత్తుపల్లి/వేంసూరు/ఏన్కూరు: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపు నిచ్చారు. సత్తుపల్లి మండలం రేజర్ల నుంచి ఎన్టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్, రాజీవ్‌నగర్ మీదుగా పార్టీ జెండాలను ఆవిష్కరిస్తూ భారీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా వేంసూరు మండలంలోని దుద్దెపూడిలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఏన్కూరులో బీఆర్‌ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ఆ పార్టీ జెండా ఆవిష్కరించి.. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పాలన రైతులకు స్వర్ణ యుగంగా ఉందని కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక కష్టలు పడుతున్నారని అన్నారు.అన్ని వర్గలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం న్యాయం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పాలా వెంకటరెడ్డి, మోరంపూడి శ్రీధర్‌బాబు, మట్టా రవి, మోరంపూడి రామకృష్ణ, మహేశ్వరరెడ్డి, దొడ్డ వెంకటకృష్ణరెడ్డి, పుచ్చాకాయల శంకర్‌రెడ్డి, పొన్నం హరికృష్ణ, భూక్యా ధర్మ, వినోద్‌కుమార్, ఎస్‌కే బాజీ, చాంద్‌పాషా, దావీద్, శ్రీకాంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



సత్తుపల్లిరూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ

తల్లాడ/సత్తుపల్లిరూరల్/కల్లూరు: వాడ వాడలా మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, వేము రాంబాబు పిలుపునిచ్చారు. తల్లాడలో టీయూసీఐ, సత్తుపల్లి, కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేబర్‌కోడ్, కార్మిక చట్టాల పునరుద్ధరణకై మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.లాల్‌మియా, తల్లాడ ఏరియా కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల్‌మీరా, డి.వెంకటేశ్వర్లు, కిషోర్, నాగయ్య, సురేష్, రామకృష్ణ, వెంకటి, గోసవీడు, నాగేశ్వరరావు, సతీష్, సీపీఐ మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు రహీమతుల్లా, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, వీరయ్య, పుల్లయ్య, వీరబాబు, కోటేశ్వరరావు, తిరుపతిరావు, ఏఐటీయూసీ మండల నాయకులు దామాల దయాకర్, ఆస్పత్రి కార్మికులు స్వరూప, కోటేశ్వరి, జాన్‌బీ, సత్యవతి, జీపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

జంతు సంక్షేమమే - జన సంక్షేమం

మధిర: జంతువుల సంక్షేమమే జన సంక్షేమం అని పశువైద్య సిబ్బంది లక్ష్మణ్ రావు తెలిపారు. శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా మధిర పట్టణ వెటర్నరీ ఏరియా ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ పండరీబాబును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు చికిత్సతో వాటిని సంరక్షించే పశు వైద్య సేవకులను గౌరవింపజేసుకునే పండగ రోజు అని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలు అల్పాదాయం కలిగిన రైతు కుటుంబాలకు, చిన్న మొత్తాలు పెట్టుబడితో స్థానికంగా, ఆర్థికంగా కుటుంబ పోషణకు చక్కటి మార్గం పాడి పరిశ్రమ అని తెలిపారు. మూగజీవులు వివిధ రకాల వ్యాధులతో జబ్బు చేసినప్పుడు చికిత్స కోసం నోటితో మాట్లాడలేని స్థితిలో మూగజీవాలకు మారుమూల గ్రామాల్లో వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులో లేని గ్రామాల్లో, పశువైద్య సిబ్బంది వాటి లక్షణాలు గమనించి అవగాహనతో గుర్తించి చికిత్సలు అందించి రక్షిస్తున్నట్లు తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వేసవి బాల్ బాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్ అమిరేశి లింగయ్య మాట్లాడుతూ వచ్చేనెల 31 వరకు శిక్షణ ఉంటుందని, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, శిబిరం నిర్వాహణకు పలువురు దాతలు సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బి.ఉపేందర్, బి.గోపి, సీహెచ్.శశిధర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

తల్లాడ: తల్లాడలో టీడీపీ సభ్యత్వ కార్డులను పార్టీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. హైదరాబాద్ టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన 2024–25 సంవత్సరానికి సబంధించి టీడీపీ లామినేటెడ్ కార్డులను గ్రామ, వార్డు అధ్యక్ష, కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కూచిపూడి వెంకటేశ్వర్లు, దూపాటి భద్రరాజు, రావూరి రవిప్రసాద్, శ్రీనివాసరాజు, ప్రసాద్‌బాబు, కొమ్మినేని నరసింహారావు, సురేష్, తమ్మిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వేంసూరు: వేంసూరు ఉన్నత పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదివన విద్యార్థులు శనివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ,ఆనాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి



మధిర: నివాళులర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మధిర: పహల్గాం దాడిలో మరణించిన అమరులకు మధిర సబ్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం నివాళులర్పించారు. ఏడీఈ అనురాధ, ఉద్యోగులు గణేష్, మైథిలి, చెరుపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి: పహల్గాంలో యాత్రి కులపై ఉగ్రదాడిని నిరసిస్తూ సత్తుపల్లి బస్టాండ్ రింగ్‌సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటు కూసంపూడి మహేష్, దొడ్డా శంకర్‌రావు, యాగంటి శ్రీనివాసరావు, ఎస్.కే.రఫీ, వీరపనేని బాబి, కొత్తూరు ఉమా, గోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బెల్లంకొండ రాము, మరికంటి శ్రీనివాసరావు, ఎస్.కే.చాంద్‌పాషా, అయూబ్‌పాషా, తుంబూరు దామోదర్‌రెడ్డి, పంతంగి సాంబశివరావు, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, మాధురి మధు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బనిగండ్లపాడులో..

ఎర్రుపాలెం: ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళిగా మండలంలోని బనిగండ్లపాడులో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు యన్నం పిచ్చిరెడ్డి, పుల్లారెడ్డి, యన్నం సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిటౌన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్ర దాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన సత్తుపల్లి బంద్ విజయవంతమైంది. వస్త్ర,వాణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా మూసి వేశారు. బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యాన ఆ పార్టీ శ్రేణులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ బంద్‌కు సంఘీభావం తెలపాలని కోరారు. సినిమా థియేటర్లు, పెట్రోల్ బంక్‌లు తదితర వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, పుల్లారావు యాదవ్, పాలకొల్లు శ్రీను, శివ, నరేష్, పర్సా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్క్రీన్ షేర్ చేసుకుని నగదు స్వాహా..

వైరారూరల్: వాట్సాప్ స్క్రీన్ షేర్ చేసుకున్న సైబర్ నేరగాడు రూ.15 వేల నగదు కాజేశాడని ఓ వ్యక్తి వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని విప్పలమడకకు చెందిన పత్తిపాటి శాంతయ్య స్మార్ట్ ఫోన్‌లో ఫోన్‌పే యాప్ సాంకేతిక లోపం ఎదురై లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో ఆయన ఫోన్‌పే యాప్‌లో చూపించిన కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా, అవతలి వ్యక్తి వాట్సాప్‌లోకి రావాలని సూచించి స్క్రీన్ షేర్ తీసుకుని బ్యాలెన్స్ చూడాలని చెప్పి సెక్యూరిటీ కోడ్ గుర్తించాడు. ఆ వెంటనే సైబర్ నేరగాడు శాంతయ్య ఫోన్ స్క్రీన్‌ను బ్లాక్ చేసి ఆయన ఖాతా నుంచి రూ.15 వేల నగదు బదిలీ చేసుకున్నాడు. ఆ తర్వాత స్క్రీన్ షేర్ నుంచి వైదొలగగా, మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోటల్‌లో బాస్మతి బియ్యం చోరీ

కారేపల్లి: హోటల్‌లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు బాస్మతి బియ్యంతోపాటు నగదు చోరీ చేశారు. మండలంలోని ఎర్రబోడుకు చెందిన చిత్తారు చైతన్య కామేపల్లి క్రాస్ వద్ద హోటల్ నిర్వహిస్తోంది. శుక్రవారం రాత్రి హోటల్ మూసేసి వెళ్లిన ఆమె శనివారం ఉదయం వచ్చేసరికి షట్టర్ తాళం పగులకొట్టి ఉంది. దీంతో లోపల పరిశీలించగా ఆరు క్వింటాళ్ల బాస్మతి బియ్యం, రూ.7,500 నగదుతోపాటు కొంత సామగ్రి చోరీ అయినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎర్రుపాలెం: ఏపీ రాష్ట్రం నుంచి ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్లకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం సీజ్ చేశారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకం ద్వారా తీసుకున్న ఇసుకను పెద్దాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జి.కృష్ణ రేమిడిచర్లకు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఇందుకోసం అనుమతి లేకపోవడంతో డ్రైవర్‌తోపాటు యజమాని మధుసూదన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ముదిగొండలో జలబిందెల ఊరేగింపు



ఊరేగింపుగా బయలుదేరిన గ్రామస్తులు, మహిళలు

ముదిగొండ: ముదిగొండ గొడసంఘం ఆధ్వర్యంలో జలబిందెల ఊరేగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. జలబిందెలతో కంఠమహేశ్వరస్వామి దేవాలయానికి చేరుకున్నారు. దేవాలయం వద్ద గణపతిపూజ, పుణ్యహవాచనం, మండపారాధన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముదిగొండ ప్రధాన సెంటర్‌లో ముగ్గులు వేసి నృత్యాలు చేశారు.